క్లుప్తంగా

పలువురికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న విజయ్‌కుమార్

రఘునాథపల్లి: ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తిచేసిన జిల్లాకు చెందిన పలువురు మంగళవారం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతులమీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. రఘునాథపల్లి మండలం కుర్చపల్లి గ్రామానికి చెందిన తోకల విజయ్‌కుమార్ హైదరాబాద్‌లో గవర్నర్‌చే డాక్టరేట్ పొందారు. కూలీ పనులకు వెళ్లే తోకల వెంకటయ్య–సరోజన దంపతుల కుమారుడు విజయ్‌కుమార్ ఉస్మానియా యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీయూజీసీ–నెట్ (జేఆర్ఎఫ్)తో పాటు టీఎస్–సెట్ అర్హత సాధించాడు. తెలంగాణ విశ్వ విద్యాలయం నుంచి ఎంకామ్ పూర్తి చేసి ఎంబీఏ పట్టా పొంది సెట్ అర్హత సాధించాడు. వాణిజ్యశాస్త్రంలో పీహెచ్‌డీకి చెందిన విజయ్‌కుమార్ 'పబ్లిక్ ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో డిజిటల్ బ్యాంకింగ్ వినియోగంపై రిస్క్–రివార్డు కస్టమర్ల ప్రభావం' అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత వ్యాసానికి గాను యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. విజయ్‌కుమార్ ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ విభాగంలో పార్ట్‌టైమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఓయూ నుంచి అత్యున్నత డాక్టరేట్ పొందిన విజయ్‌కుమార్‌ను గ్రామస్తులు అభినందించారు.

పోతారం నుంచి సతీష్‌కుమార్‌కు..



తరిగొప్పుల: మండలంలోని పోతారం గ్రామానికి చెందిన కందుల సతీష్‌కుమార్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి వాణిజ్యశాఖలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందారు. మంగళవారం నిర్వహించిన 84వ ఉస్మానియా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ కార్యక్రమంలో చాన్స్‌లర్ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, ఉస్మానియా వీసీ ప్రొఫెసర్ కుమార్ ములుగారం చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నాడు. పర్‌ఫామెన్స్ ఏవల్యూయేషన్ ఆఫ్ నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్2013 ఏ స్టడీ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై ప్రొఫెసర్ కమటం శ్రీనివాస్ పర్యవేక్షణలో తన పరిశోధన పూర్తి చేయడం జరిగిందని సతీష్‌కుమార్ తెలిపారు.

ఘన్‌పూర్ వాసికి..



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ ఎస్సీ కాలనీకి చెందిన కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సింగపురం(చింత) శారద ఉస్మానియా యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ పొందారు. 'సింగరేణి కాలరీస్ కంపెనీలో చట్టపరంగా స్వచ్ఛందంగా తీసుకుంటున్న భద్రత ప్రమాణాలు–ఒక పరిశీలన' అనే అంశంపై పరిశోధన గ్రంథం పూర్తి చేసినందుకు డాక్టరేట్ అందించినట్లు హైదరాబాద్ ఓయూ హెడ్ ఆఫ్ కామర్స్ ప్రొఫెసర్ ఎం.గంగాధర్ తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీలో గవర్నర్ చేతులమీదుగా డాక్టరేట్ పట్టా పొందారు. ఘన్‌పూర్ ఎస్సీ కాలనీకి చెందిన శారద డాక్టరేట్ పొందడంపై పలువురు అభినందనలు తెలిపారు.

వెంకట నర్సింహాచారికి..



దేవరుప్పుల: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన 84వ స్నాతకోత్సవంలో మండల కేంద్రానికి చెందిన చిలుమోజు నరహరి–ప్రమీల కుమారుడు వెంకటనర్సింహాచారీ గవర్నర్ చేతుల మీదుగా కామర్స్ డిపార్ట్‌మెంట్ నుంచి గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. పేద కుటుంబానికి చెందిన చారి.. వికలాంగత్వం కలిగి ఉండడంతో మేనత్త గుడిపల్లి నీలమ్మ ప్రత్యేక ప్రోత్సహంతోనే గౌరవ ప్రదమైన డాక్టరేట్ లభించేందుకు దోహదపడిందన్నారు. డాక్టరేట్ పొందడం పట్ల బంధు, మిత్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

డైరీల పంపిణీ



పాలకుర్తి: వావిలాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయుడు నేతి కొండయ్య తల్లి శశిరేఖ జ్ఞాపకార్థం డైరీలను పంపిణీ చేశారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీడీఓ ఎస్.రవీందర్ పాల్గొని విద్యార్థులకు డైరీలు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పోతుగంటి నర్సయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్, ఉపాధ్యాయులు సోమాని నాయక్, బాలాజీ, జస్వంతరాణి, జ్ఞానకుమారి, సుగుణాదేవి, నీలకంఠం, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా సోమనాథుడి స్మృతి వనం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన పరిస్థితి
- వినియోగంలోకి తేవాలని కవులు, ప్రజల విజ్ఞప్తి



స్మృతి వనంలో పిచ్చి మొక్కలు



శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయం, జ్ఞాన మందిరం



పగులగొట్టిన జ్ఞాన మందిర కిటికీ అద్దాలు



గ్రంథాలయ భవనంలో కండోమ్స్



స్మృతి వనంలో మద్యం సీసా

పాలకుర్తి టౌన్: తొలి తెలుగు విప్లవ కవి బసవ పురాణం గ్రంథకర్త పాల్కురికి సోమనాథుడి గుర్తుగా మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి సమీపంలో నిర్మించిన స్మృతి వనం నేడు ఆలనాపాలన లేక అధ్వానంగా తయారైంది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కోటి రూపాలయతో సోమనాథుడి పేరుతో స్మృతి వనం నిర్మించింది. పట్టించుకునే వారు లేక ప్రస్తుతం స్మృతి వవనం మందు బాబులకు అడ్డాగా మారిపోయింది. గదుల్లో మద్యం సీసాలు, కండోమ్ ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. తలుపుల తాళాలు పగులకొట్టి కిటికీల అద్దాలను ఆకతాయిలు ధ్వంసం చేశారు. పచ్చని గడ్డితో ఉండాల్సిన గార్డెన్ పశువుల కొట్టంగా తయారైంది. శిథిలావస్థకు చేరకుముందే స్మృతి వనంకు భద్రంగా సెక్యూరిటీ గార్డులతోపాటు పోలీసులు ప్రతి రోజు పెట్రోలింగ్ నిర్వహించాలని, వెంటనే వినయోగంలోకి తీసుకురావాలని ప్రజలు, కవులు, కళాకారులు.. కలెక్టర్, ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేస్తున్నారు.

భయపెడుతున్న గ్రామ సింహాలు

- బెంబేలెత్తుతున్న ప్రజలు



పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో వీధికుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ వివిధ అవసారాల కోసం బయటకు వచ్చే ప్రజలు, పాఠశాలల వెళ్లే విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. రోడ్లపై వెళ్లాలంటే ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారు. ద్విచక్ర వాహనాలను కుక్కలు వెంబడిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కల బెడదను నివారణించాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన పూజ



పూజలో పాల్గొన్న భక్తులు

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్త జనసందోహం నడుమ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి దంపతుల ఆధ్వర్యంలో అష్టదళ పాద పద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, వీరన్న, కృష్ణ, హరిశంకర్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ

హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణం విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం



ఇరువర్గాలకు నచ్చచెబుతున్న ఎస్సై వినయ్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఛాగల్లులో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణ పంచాయితీ చిలికిచిలికి మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌కు చేరింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఛాగల్లులో జాతీయ రహదారి పక్కనే ఎంతో విలువైన ప్రభుత్వ భూమి ఉండగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రహదారి పక్కనే రైతువేదిక, పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేశారు. కాగా, ప్రస్తుతం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు, కాంట్రాక్టర్ కనకం గణేశ్‌కు ఛాగల్లులో హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణానికి పనులు వచ్చాయి. దాంతో సదరు స్థలంలో నిర్మాణ పనులు చేసేందుకు గణేశ్ సోమవారం సాయంత్రం పొక్లెయినర్‌తో పనులు చేయిస్తుండగా ఎలాంటి నిర్మాణాలు చేయవద్దని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దాతో పోలీసులు పొక్లెయినర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంగళవారం ఈ విషయమై తమకు అన్ని అనుమతులు ఉన్నా పొక్లెయినర్‌ను ఎందుకు తీసుకువచ్చారని గణేష్, బీఆర్ఎస్ నాయకులను, పోలీసులను ప్రశ్నించగా ఎస్సై వినయ్‌కుమార్ సదరు స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. విచారణ సమయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. కాగా, ఎస్సై ఏదైనా సమస్య ఉంటే రెవెన్యూ అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని, అనవసరంగా గొడవలు చేయవద్దని సూచించారు. గణేశ్ మాట్లాడుతూ కొందరు కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతో రాజకీయం చేస్తూ అభివృద్ధి పనులను ఉద్దేశ్యపూర్వకంగా అడ్డుకుంటున్నారని అన్నారు. పీఆర్ ఏఈ చెబితేనే పొక్లెయినర్‌తో పనులు చేయిస్తున్నామని, హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి కలెక్టర్ స్థాయి నుంచి అన్ని అనుమతులు వచ్చాక ఉద్దేశపూర్వకంగా అడ్డుపడుతున్నారన్నారు. ఈ విషయమై కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు స్పందించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ నాయకులు పొన్న రాజేష్, భాస్కుల సమ్మయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్, చల్లా చందర్‌రెడ్డి, మారెపల్లి ప్రసాద్, పెసరు సారయ్య, గుండె మల్లేశం, చిట్టిబాబు ఉన్నారు.

సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి



స్టేషన్‌ఘన్‌పూర్: మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన హామీలకు అనుగుణంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని టీఎస్ పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గీరెడ్డి ప్రమోద్ రెడ్డి అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్దరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ఎదుట సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఘన్‌పూర్ జెడ్పీఎస్ఎస్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్‌ను పునరుద్దరించాలని చేపట్టనున్న ధర్నాకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి వంగ రఘు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె.ప్రకాశం, ఎంఈఓ కొమురయ్య, ఘన్‌పూర్ జెడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం ఎం.సంపత్, ఎ.భాస్కర్‌రెడ్డి, వి.మురళి, పి.వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్‌రెడ్డి, రాగమని, శైలజ, కరుణాకర్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

తరిగొప్పుల: ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షుడు సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీన హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, హెచ్‌ఎం రవీందర్, లక్ష్మీనారాయణ, లిల్లీ మేరీ పాల్గొన్నారు.

బచ్చన్నపేట: ఉపాధ్యాయ, ఉద్యోగులకు గుదిబండలా మారిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల ఎల్లారెడ్డి కోరారు. మండలంలోని కొన్నె గ్రామ సెకండరీ పాఠశాలలో సెప్టెంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన మహాధర్నా పోస్టర్లను ఆయన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు రామవజ్జుల అనిల్, ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, నరేంద్రచారి పాల్గొన్నారు.

హామీని నిలబెట్టుకోవాలి

పాలకుర్తి టౌన్: సీపీఎస్ రద్దు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని టీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు బైకాని వెంకన్న అన్నారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే సీపీఎస్ మహా ధర్నా చౌక్ వద్ద తలపెట్టికన పీఆర్‌టీయూ మహాధర్నా వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, హెచ్‌ఎం పాయం శోభరాణి ఆవిష్కరించారు. మండల ప్రధాన కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్, కూటికంటి సోమయ్య, భీరం వెంకట్‌రెడ్డి, రావులు మనోహర్, ఓరిగంటి రమేష్, నర్సంహమూర్తి పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంఘం నాయకులు, ఉపాధ్యాయులు ధర్నా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సీతారామయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ టీవీ వైర్ల తొలగింపు



తొలగించిన వైర్లు చూపిస్తున్న విద్యుత్ సిబ్బంది

జనగామ: పట్టణంలోని సెక్షన్–1లో ప్రమాదకరంగా ఉన్న కేబుల్ టీవీ వైర్లను తొలగంచినట్లు ఏఈ సౌమ్య తెలిపారు. మంగళవారం ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్, డివిజనల్ ఇంజనీర్ లక్ష్మీనారాయణరెడ్డి ఆదేశాల మేరకు ప్రమాదకరంగా వేళాడుతున్న కేబుల్ టీవీ వైర్లను తొలగించారు. కేబుల్ వైర్లతో తరుచూ ప్రమాదాలు జరుగుతుండడంతో పట్టణ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆయా వార్డుల పరిధిలో వెళాడుతూ ఉన్న కేబుల్ టీవీ వైర్లను నిర్వాహకులు వెంటనే తొలగించాలన్నారు. ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో..

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా విద్యుత్ స్తంభాలపై ఆపరేటర్లు ఏర్పాటు చేసిన కేబుల్, ఇంటర్‌నెట్ వైర్లను విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా లైన్‌మన్ వాసం శ్రీధర్ పటేల్ మాట్లాడుతూ విద్యుత్‌స్తంభాలపై ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలని పలుమార్లు సూచించినా స్పందించడం లేదన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం సరైంది కాదని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేబుల్‌వైర్లను తొలగించినట్లు తెలిపారు.

గుంతల పూడ్చివేత



జఫర్‌గఢ్: స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి జఫర్‌గఢ్ మండల కేంద్రానికి వచ్చే ప్రధాన రహదారి బొల్లమత్తడి కల్వర్టు వద్ద రోడ్డు గుంతలు ఏర్పడి పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా, మంగళవారం సాక్షిలో 'రహదారి బురదమయం' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. సదరు కాంట్రాక్టర్ ద్వారా ట్రాక్టర్లు, పొక్లెయినర్ల ద్వారా మొరం తీసుకొచ్చి రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు.

పెంబర్తిలో..



జనగామ రూరల్: పెంబర్తి గ్రామంతో రామాలయం నుంచి రైల్వే గేట్ వరకు రోడ్డు బురదమయం కావడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. స్పందించిన గ్రామం మాజీ ఎంపీటీసీ మూల రవి రోడ్డుపై మొరం పోయించి గుంతలు పూడ్చివేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞత తెలిపారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



జనగామ రూరల్: లూయిస్ డాగురే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ జీవితంలో గత స్మృతులను గుర్తుచేసుకోవడం ఫొటోలతో సాధ్యమని, అందమైన జ్ఞాపకాలను పది కాలాల పాటు పదిలంగా ఉంచేది ఫొటో మాత్రమే అని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా, మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు, ఫొటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య



మాట్లాడుతున్న రాజయ్య

చిల్పూరు: బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. ఊరూరికి బీఆర్ఎస్ పార్టీ సంక్షేమాలు.. ఇంటింటికి కేసీఆర్ పథకాలు కార్యక్రమాన్ని మంగళవారం వంగాలపల్లి, నష్కల్, దేశాయి తండ, పల్లగుట్ట, ఫతేపూర్, గార్లగడ్డతండాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కోఆర్డినేటర్ మాలోత్ రమేశ్ నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రాజయ్య మాట్లాడారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు యూరియా అందక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఒక పార్టీ గుర్తుతో గెలిచి మరో పార్టీలో చేరిన కడియం శ్రీహరి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎడవెల్లి కృష్ణారెడ్డి, జనగాం యాదగిరి, కేశిరెడ్డి రాకేష్‌రెడ్డి, మారపాక రవి, ఆకుల కుమార్, రంగు హరీష్, నారగోని రవిచంద్ర, బత్తుల రాజన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్ ప్రారంభోత్సంలో ప్రిన్సిపాల్ వరలక్ష్మి

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పీఎంశ్రీ పథకం ద్వారా నూతనంగా ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఎటీఎల్)ను ప్రిన్సిపాల్ వరలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు కొత్తగా వచ్చిన ల్యాబ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. దీన్ని విద్యార్థులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని ఆమె కోరారు.

నివాళి



పాలకుర్తి: మండలంలోని రాఘవపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి తండ్రి నల్ల రామయ్య మృతి చెందారు. కాగా, మంగళవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గ్రామానికి చేరుకుని రామయ్య మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ జెడ్పీటీసీలు పుస్కూరి శ్రీనివాసరావు, సుందర్‌రాంరెడ్డి, పార్వతి, మాజీ ఎంపీపీలు మల్లేశం, కారుపోతుల వేణు, చెరుకు రాములు, ఇతర నాయకులు ఉన్నారు.

పరామర్శ

దేవరుప్పుల: మండల కేంద్రంలో జోగు భీమయ్య, సింగరాజుపల్లిలో జోగు మల్లమ్మ, కొంగరిభాస్కర్, బత్తిని వెంకటయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్, గ్రామ అధ్యక్షుడు లొడంగి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

అడవి పందిని వేటాడిన వ్యక్తుల పట్టివేత

రఘునాథపల్లి: మండలంలోని కోమళ్ల టోల్ గేట్ సమీపంలోని గుట్టలలో వేటకు వెళ్లి అడవి పందిని బంధించి తీసుకెలుతున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ మంగళవారం తెలిపారు. కానిస్టేబుల్స్ యుగంధర్, సాయికుమార్‌లు మండల కేంద్రంలో పెట్రోలింగ్ చేస్తుండగా కురాకుల రమేశ్, కడమంచి మహేష్‌లు అడవి పందిని బంధించి తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. అడవి పందిని స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకుని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కొండల్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ శోభారాణి, బీట్ ఆఫీసర్ రమేశ్‌లకు అప్పగించామని, ఎవరైనా వన్యప్రాణులను వేటాడితే చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని ఎస్సై హెచ్చరించారు.

కళ్లను కాపాడుకోవాలి



బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ కళ్లను కాపాడుకోవాలని నేత్ర వైద్యుడు కె.బాలకిషన్ అన్నారు. మంగళవారం పడమటికేశ్వాపూర్ గ్రామంలో ఆద్వా కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 మందికి కంటి పరీక్షలను నిర్వహించి మందులు అందించామని తెలిపారు. గ్రామస్తులు అన్నోజు బాలచారి, గుర్జకుంట గణేష్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బచ్చన్నపేట: గోపాల్‌నగర్ గ్రామానికి చెందిన పిట్టల మహేశ్వరి గతంలో అనారోగ్యంతో ఆస్పత్రిలో చేసి చికిత్స తీసుకుంది. కాగా, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కృషితో చికిత్స నిమిత్తం మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మాజీ సర్పంచ్ పర్వతం మధుప్రసాద్ మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. గుర్రపు రమేష్, వద్ది వెంకటయ్య, పేరబోయిన పరశురాములు, బొమ్మెన నర్సింహులు, శ్రీకాంత్, జనార్దన్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కొనసాగుతున్న నిరాహార దీక్షలు



జనగామ రూరల్: గానుగుపహాడ్, చీటకోడూర్ బ్రిడ్జిలు నిర్మించాలని బ్రిడ్జి సాధన సమితి అధ్యక్షుడు యాసారపు కరుణాకర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం నాటికి దీక్షలు 20వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షను ఉద్దేశించి కరుణాకర్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిల నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రామచంద్ర గూడెం మాజీ సర్పంచ్ పయ్యావుల కుమార్, పయ్యావుల శ్రీశైలం, మేకల శ్రీను,రవి తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రహదారులు అధ్వానం

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో ఉన్న అంతర్గత రహదారులు, మురికి కాల్వలు అధ్వానంగా ఉన్నాయని, వీటిని ఎవరూ పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య, పార్టీ మండల కమిటీ సభ్యులు కాట సుధాకర్ అన్నారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జఫర్‌గఢ్‌లోని వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నల్లతీగల శ్రీను, సాకి నర్సింగం, ఎల్మకంటి సుధాకర్, బాబు, సముద్రాల దుర్గయ్య, కాట భిక్షపతి, అనిల్, సముద్రాల రాజు తదితరులు పాల్గొన్నారు.

21న ఇసుక వేలం


దేవరుప్పుల: మండలంలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే పోలీసులు సీజ్ చేసిన ఇసుకను తిరిగి 21వ తేదీన వేలం వేయనున్నట్లు తహసీల్దార్ ఆడెపు అండాలు తెలిపారు. మంగళవారం మండల తహసీల్ వద్ద ఆరు ఇసుక ట్రిప్పుల కోసం వేలం వేయగా నిర్దేశిత సమయానికి ఎవరు రానన్నుందున తిరిగి వేలం ప్రకటన చేసినట్లు ఆమె తెలిపారు.

సీనియర్ కళాకారుడు యాదయ్యగౌడ్ మృతి



దేవరుప్పుల: కడవెండికి చెందిన సీనియర్ జానపద, భాగవతం కళాకారుడు బత్తిని యాదయ్యగౌడ్ మంగళవారం మృతి చెందారు. యాదయ్య మృతదేహానికి సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, సీఐటీయూ, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు, సింగారపు రమేష్, సీపీఐ జిల్లా నాయకుడు బిల్లా తిరుపతిరెడ్డి, వామపక్షపార్టీల మండల కార్యదర్శులు జీడీ ఎల్లయ్య, ఇంటి వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు తాటిపెల్లి మహేష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నక్క రమేష్, రపేల్‌రెడి, కాంగ్రెస్ మండల నాయకుడు అచ్చ య్య, లీనారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించా రు. పల్లెప్రజలకు వినోదం కలిగించేలా సుదీర్ఘకాలంగా భాగవత కళాకారుడిగా రాణించిన యాదయ్య మృతి పట్ల పద్మశ్రీ పురస్కార గ్రహీత గడ్డం సమ్మయ్య ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

మృతుడు రిటైర్డ్ హెచ్‌ఎంగా గుర్తింపు



కృష్ణారెడ్డి (ఫైల్)

రఘునాథపల్లి: నిడిగొండ రైల్వే బ్రిడ్జి సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం గుర్తించిన మృతదేహం మడికొండ గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎందని ఎస్సై దూదిమెట్ల నరేష్ మంగళవారం తెలిపారు. మడికొండకు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం మాదాడి కృష్ణారెడ్డి (71) ఈ నెల 16వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కాలినడకన రఘునాథపల్లికి చేరుకుని అస్వస్థకు గురి కాగా స్థానికులు గుర్తించి అంబులెన్స్‌లో జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి రాత్రి 11.30 గంటల సమయంలో కాలినడకన నిడిగొండకు చేరుకుని తీవ్ర అస్వస్థతకు గురై కృష్ణారెడ్డి మృతి చెందాడు. అనారోగ్య సమస్యలతోనే తన తండ్రి మృతి చెందాడని కుమారుడు రఘు ఫిర్యాదు మేరకు జనగామ ప్రభుత్వ స్పత్రిలో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

ఉన్నత చదువులకు సాయం అందిస్తా

పాలకుర్తి: నియోజకవర్గంలోని నిరుపేదల విద్యార్థుల ఉన్నత చదువులకోసం ఆర్థికసాయం అందిస్తానని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి అన్నారు. ఢిల్లీ యూనివర్సిటీలో సీటు వచ్చిన కొండాపురం పెద్దతండాకు చెందిన భూక్య వంశీ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. కాగా, మంగళవారం ఝాన్సీరెడ్డి.. వంశీ కుటుంబ సభ్యులను కలిసి ఉన్నత చదువులకు సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు.